క్లుప్తంగా

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

ప్రకాశం నగర్: స్థానిక సంపత్ నగర్‌లోని రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్లో వేసవి క్రీడా శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఏప్రిల్ 24న ప్రారంభమైన ఈ తరగతుల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో తాము నేర్చుకున్న వివిధ అంశాలను ప్రదర్శించారు. పాఠశాల డైరెక్టర్ టి.స్వరూప్ రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మజ్జిగ వితరణ



మజ్జిగ పంపిణీ చేస్తున్న రజనీకాంత్

రాజమహేంద్రవరం సిటీ: వేసవి ఎండల నేపథ్యంలో 30వ డివిజన్ చర్చిపేటలో గురువారం మజ్జిగ వితరణ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కాటం రజనీకాంత్ మాట్లాడుతూ ఎంపీ భరత్ రామ్ ఆదేశాలతో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి సూచనతో చర్చిగేట్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఎండలు తగ్గే వరకూ కొనసాగిస్తామన్నారు. పార్టీ డివిజన్ ఇన్‌చార్జి కాటం ప్రియాంక పాల్గొన్నారు.

3న రౌండ్ టేబుల్ సమావేశం

సీటీఆర్ఐ: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని పబ్లిక్ లైబ్రరీ ప్రాంగణంలో జూన్ 3వ తేదీన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని ఆ సంఘ వ్యవస్థాపకుడు సానబోయిన రామారావు తెలిపారు. స్థానిక తిలక్ రోడ్డులోని సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత సేన జాతీయ అధ్యక్షుడు జేబీ రాజు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల రిజర్వేషన్లను ప్రస్తుతం ఉన్న 24 శాతం నుంచి గతంలో ఉన్న 34 శాతానికి పెంచాలని, ప్రతి జిల్లాకు ఒక స్టడీ సర్కిల్‌ని ఏర్పాటు చేయాలని, అన్ని ప్రైవేట్ పాఠశాలలో 25 శాతం సీట్లను నిరుపేద బలహీన వర్గాల విద్యార్థులకు కేటాయించాలనే పలు డిమాండ్లతో ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుందన్నారు.

ప్రజా నాట్యమండలి వార్షికోత్సవం

ప్రకాశం నగర్: ప్రజా నాట్యమండలి 80వ వార్షికోత్సవం గురువారం స్థానిక అంబళ్ల సూర్యారావు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మండలి సీనియర్ కళాకారుడు బొడ్డుబుల్లి అబ్బాయి ప్రజా నాట్యమండలి జెండాను ఆవిష్కరించారు. జిల్లా కన్వీనర్ మహంతి లక్ష్మణరావు మాట్లాడారు. అనంతరం మాదాల రంగారావు జయంతి నిర్వహించారు. ఆయన ఎర్రమల్లెలు, విప్లవ శంఖం, యువతరం కదిలింది, జనం మనం, ఎర్రమట్టి లాంటి చిత్రాలను నిర్మించి, సమాజ మార్పుకి సినిమాల ద్వారా కృషి చేశారని కొనియాడారు. బి.ఉమా మహేశ్వరి, నరేంద్ర బాబు అభ్యుదయ గేయాలు ఆలపించగా, సీపీఐ నగర నాయకులు నల్లా రామారావు, జామిశెట్టి అప్పాజీ, కాసాని శంకర్రావు, ముప్పన కుమారస్వామి పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాటు చేయండి

కంబాలచెరువు: రాజమహేంద్రవరంలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగే తెలుగుదేశం మహానాడు కార్యక్రమానికి ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్‌కు గురువారం ఆ పార్టీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఎస్పీని కలిసిన వారిలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జవహర్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు, యర్రా వేణుగోపాల్ రాయుడు, వాసిరెడ్డి రాంబాబు, కాశి నవీన్, కూడుపూడి సత్తిబాబు, గంగిన నాని, మారుకుర్తి రవి యాదవ్ ఉన్నారు.

పశు ఆరోగ్య సేవారథాల్లో పోస్టుల భర్తీకి చర్యలు

రాజమహేంద్రవరం రూరల్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశుఆరోగ్య సేవారథాల్లో పశు వైద్యులు, పారావెట్లు, డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా పశుసంవర్థకశాఖాధికారి డాక్టర్ ఎస్‌టీజీ సత్యగోవింద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వెటర్నరీ వైద్యుల పోస్టులకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగి ఉండాలని, కొత్తగా పట్టా పొందిన వారితో పాటు విశ్రాంత డాక్టర్లు కూడా అర్హులేనన్నారు. పారావెట్ పోస్టులకు డిప్లొమా ఇన్ వెటర్నరీ సైన్స్ విద్యార్హత కలిగి, 30 ఏళ్ల లోపు వయస్సు ఉండాలన్నారు. ఇక పైలట్ (డ్రైవర్) పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణులై ఉండి, హెచ్‌ఎంవీ లైసెన్స్‌తో పాటు కనీసం 2 నుంచి 3 ఏళ్ల అనుభవం, 35 ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు రాజమహేంద్రవరం దేవీచౌక్ సమీపంలో, గోకవరం బస్టాండ్ రోడ్డులో గల గవర్నమెంట్ వెటర్నరీ హాస్పిటల్ ఆవరణలోని జిల్లా పశువైద్యాధికారి కార్యాలయంలో ఈ నెల 29వ జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు ఉమ్మడి జిల్లా సంచార పశు సేవారథాల మేనేజర్ రమేష్ రావును 62606 24232 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ముందస్తు సాగు.. దిగుబడి బాగు

- ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



సాగు సమాయత్తం సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

కడియం: ఖరీఫ్ సాగును వీలైనంత ముందుగా ప్రారంభిస్తే నవంబర్, డిసెంబర్ నెలల్లో ఏర్పడే తుపానుల బారిన పడకుండా కాపాడుకోగలుగుతామని అధికారులు చెబుతున్నారు. సాగు సమాయత్తం అవగాహన సదస్సుల్లో భాగంగా రైతులకు ఈ మేరకు అవగాహన కల్పిస్తున్నారు. మండలంలో వరికోతలు పూర్తయిపోయాయి. జూన్ మొదటి వారంలో కాలువల ద్వారా నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జూన్ ప్రారంభంలోనే ఆకుమడులను సిద్ధం చేసుకుని, తక్కువ రోజుల వ్యవధిలో పంట చేతికొచ్చే వరి రకాలను సాగు చేసుకోవడం ద్వారా రైతు కష్టార్జితం తుపాను బారిన పడకుండా చూసుకోవచ్చు. వివిధ కారణాలతో రైతులు సాగును ఆలస్యం చేస్తున్నారు. దీంతో పంట చేతికొచ్చే సమయానికి వర్షాలు, తుపానులు వంటి ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోవాల్సి వస్తోంది. దీంతో రైతులను ముందస్తు సాగుకు సమాయత్తం చేసేందుకు అధికారులను సమన్వయంతో ముందుకు వెళుతున్నారు. అలాగే కౌలు రైతు కార్డులు రెన్యువల్ చేసుకోవడం, రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలను కూడా అందించేందుకు సిద్ధమయ్యారు.

5,100 ఎకరాల్లో సాగుకు సిద్ధం

మండల పరిధిలోని వేమగిరి, కడియం, జేగురుపాడు, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు, మురమండ, దుళ్ల, కడియపుసావరం గ్రామాల పరిధిలోని 5,100 ఎకరాల్లో వరి సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. 150 రోజుల్లో పంట చేతికి వచ్చే స్వర్ణ రకాన్నే ఎక్కువగా సాగు చేయనున్నారు. వంద టన్నుల వరకు విత్తనాలు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. ఆర్బీకేల ద్వారానే కాకుండా సహకార సొసైటీల ద్వారా కూడా విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టారు. కడియం ప్రాంతానికి 1318 రకం వరి కూడా అనుకూలంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆర్ఎన్ఆర్, పీఎల్ 100 పంటకాలం.. స్వర్ణ కంటే 20 రోజులు అధికంగా ఉంటుంది. అందువల్ల రైతుల రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. సాగు ఆరంభానికి రైతుకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నారు.

విత్తనాల ఇండెంట్ పంపించాం

ప్రస్తుతం కడియం ప్రాంతంలో స్వర్ణ రకం సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. తొలి విడతగా ప్రస్తుతం 10 టన్నుల వరకు స్వర్ణ రకం విత్తనాలకు ఇండెంట్ పంపించాం. మే 31 తరువాత కౌలురైతు కార్డులను రెన్యువల్ చేసుకోవాలని రైతులను కోరుతున్నాం. ఈ మేరకు ఇప్పటికే ఆర్బీకేల ద్వారా వ్యవసాయ శాఖ సిబ్బందికి తగిన సూచనలు అందించారు. ఇంకా ఇతర రకాల విత్తనాలు అవసరమైతే, ముందుగా సమాచారం అందిస్తే, వాటిని కూడా రైతులకు అందుబాటులో ఉంచుతాం. ఆర్బీకేల ద్వారానే కాకుండా మండలంలోని సహకార సొసైటీల ద్వారా కూడా విత్తనాల సరఫరా ఉంటుంది. రైతులు సద్వినియోగం చేసుకుని, వీలైనంత త్వరగా సాగు ప్రారంభించాలి. తుపాన్ల సమయానికంటే ముందే పంట చేతికొచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.

– కె.ద్వారకాదేవి, మండల వ్యవసాయాధికారి, కడియం

విద్యాభివృద్ధికి సీఎం జగన్ ప్రాధాన్యం

- కొవ్వూరు పర్యటన విజయవంతం
- ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: కొవ్వూరులో బుధవారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతమైందని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఎంపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నను దగ్గర్నుంచి చూడాలనే కోరికతో రాష్ట్రం నలుమూలల నుంచి వేలాది మంది విద్యార్థులు తరలివచ్చారన్నారు. చంద్రబాబు హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ కట్టడానికి మీనమేషాలు లెక్కించేవారన్నారు. ఆయా కళాశాలలకు రూ.వేల కోట్లు బకాయిలు పెట్టి, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడేవారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బకాయిలన్నింటినీ సీఎం జగన్ ఒకవైపు తీర్చుకుంటూ, విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. జగనన్న విద్యాదీవెన పథకం సొమ్ములను నేరుగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమచేస్తున్నారన్నారు. విద్యారంగానికి ఆయన అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం రూ.వేల కోట్లు కేటాయిస్తున్నారన్నారు.

మహానాడు పేరుతో రోడ్లకు తూట్లు

రాజమహేంద్రవరం నగరాన్ని ఎంతో శోభాయమానంగా తాము తీర్చిదిద్దుతుంటే, మరోవైపు మహానాడు పేరుతో టీడీపీ నాయకులు డ్రిల్లింగ్ మెషీన్లతో రోడ్లకు తూట్లు పొడుస్తున్నారని ఎంపీ భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మహానాడు జరిగేది నగరానికి సుమారు 20 కిలోమీటర్ల దూరంలోని వేమగిరిలో అయితే, రాజమహేంద్రవరంలో రోడ్లను ఎందుకు తూట్లు పొడుస్తున్నారని ప్రశ్నించారు. కంబాలచెరువు ఏర్పాటు చేసిన దండి మార్చ్ ఆకృతుల వద్ద టీడీపీ జెండాలు కట్టడం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ ఆరీఫ్, పార్టీ నాయకులు నక్కా శ్రీనగేష్, ఎన్‌వీ శ్రీనివాస్, మజ్జి అప్పారావు, కొత్త విజయ రాజ్యలక్ష్మి, హబీబుల్లాఖాన్, అరిగెల బాబు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్ రామ్

నేడు కంప్యూటర్ నైపుణ్యంపై పరీక్ష

- పకడ్బందీగా ఏర్పాట్లు
- డీఆర్ఓ నరసింహులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గ్రామ, వార్డు కార్యదర్శులకు కంప్యూటర్ నైపుణ్యంపై ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా శుక్రవారం ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. ఆయన గురువారం డీఆర్ఓ చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ కారుణ్య నియామకాల కింద నియమించబడి రెవెన్యూ, పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖల తరపున గ్రామ, వార్డు సచివాలయాలలో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు కంప్యూటర్ నైపుణ్యంపై పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కాతేరులోని జీఎస్ఆర్ ఆన్‌లైన్ అకాడమీలో కంప్యూటర్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి ఒక గంట ముందు అనుమతిస్తామని, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమన్నారు. హాల్ టికెట్‌తో పాటు ఆధార్, పాన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులకు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని వైద్య అధికారులకు, భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను, తాగునీటి వసతి, టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలని జీఎస్ఆర్ ఆన్‌లైన్ అకాడమీ వారిని ఆదేశించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- మురమండలో సన్మానం



వలంటీర్లకు పురస్కారాలు అందజేస్తున్న చందన నాగేశ్వర్

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగింటకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని మురమండ, దుళ్ల గ్రామాలకు వలంటీర్లకు గురువారం మురమండ కల్యాణ మండపంలో పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ జగనన్న 3,648 కిలోమీటర్ల పాదయాత్ర చేసి, ప్రజల కష్టాలను స్వయంగా చూసి, వాటి పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. సేవా వజ్రగా ఎంపికైన దుళ్ల వలంటీర్ సుంకర సురేష్‌కు రూ.30 వేలు, సేవారత్నలుగా అదే గ్రామం నుంచి ఎంపికైన ఇద్దరికి ఒకొక్కరికి రూ.20 వేలు చొప్పున అందుతాయన్నారు. ఈ రెండు గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్న 83 మంది వలంటీర్లకు ఒకొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం 8,30,000 వారి బ్యాంకుఖాతాలకు జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, జేసీఎస్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సొసైటీ చైర్మన్ ఈదర దయాళ్, దుళ్ల ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, సొసైటీ మాజీ చైర్మన్ గారపాటి బుజ్జిబాబు, పార్టీ నాయకులు అయినవిల్లి వెంకటేశ్వరరావు, మెల్లిమి గంగరాజు, సాపిరెడ్డి కామేష్, ఊటుకూరి శైలజ, నర్సరీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొత్తపల్లి శివాజీ, మాజీ ఉపసర్పంచ్ తాతపూడి బాబీ పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: గ్రామంలోని జక్కంపూడి సీతారత్నం కల్యాణ మండపంలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. తొలుత సేవావజ్ర వలంటీర్ విజయ్‌కుమార్, సేవా రత్న వలంటీర్ పద్మావతి, సేవా మిత్ర వలంటీర్లను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. సంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా, సమర్థంగా చేరేలా వలంటీర్లు కృషి చేస్తున్నారని అభినందించారు. అనంతరం ధవళేశ్వరం పంచాయతీ కార్యదర్శి దాసరి సూరిబాబు ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు చందన నాగేశ్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వైఎస్సార్ సీపీ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యుడు షబ్బర్ బాషా, వైఎస్సార్ సీపీ నాయకులు సాధనాల చంద్రశేఖర్ (శివ), ఎన్‌వీ శేఖర్, ఒంటిద్దు కృష్ణ, గోలి దేవకుమార్, చాటకాల చంటి, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, గునిపె అశోక్, మెండా రాజేష్, శ్రీరంగం బాలరాజు, పసుపులేటి దేవి, చప్పిడి జ్యోతి, పట్టపగలు వెంకటలక్ష్మి, పేర్ల బాసి, బోడపాటి కుమార్, బొడ్డేటి శివాజీ, కల్యాణి రెడ్డి, ముత్యాల జాన్, ధర్మ, చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి దాసరి సూరిబాబు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో సేవా వజ్ర, సేవా రత్న వలంటీర్లను సన్మానిస్తున్న చందన నాగేశ్వర్

ఎస్‌కేఆర్ మహిళా యూనివర్సిటీ కోసం వినతి



సీఎం జగన్‌కు వినతి పత్రం అందిస్తున్న మునికుమారి

సీటీఆర్ఐ: సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం స్థాపించిన హితకారిణి సమాజం పరిధిలోని మహిళా విద్యాసంస్థలను కలిపి శ్రీకందుకూరి రాజ్యలక్ష్మి మహిళా యూనివర్సిటీగా మార్చాలని హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాల మునికుమారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. బుధవారం కొవ్వూరు విచ్చేసిన ముఖ్యమంత్రికి ఆమె వినతిపత్రం అందజేశారు. తిరుపతిలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తప్పితే మరెక్కడా మహిళా విశ్వవిద్యాలయం లేదన్నారు. తూర్పుగోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాలకు మహిళా యూనివర్సిటీ ఆవశ్యకత ఉందని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ముని కుమారి తెలిపారు. త్వరలోనే స్థానిక నేతలతో సంప్రదింపులు జరిపి దీనికి సంబంధించిన పూర్తి కసరత్తు ప్రారంభిస్తామన్నారు.

సర్వేయర్లను అందుబాటులో ఉంచాలి

కడియం: భూముల రీసర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, అయితే ఉన్నతాధికారుల నిర్లక్ష్యం కారణంగా సర్వేయర్లు అందుబాటులో లేక పనులు ఆలస్యమవుతున్నాయని వైఎస్సార్ సీపీ కడియం మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జేగురుపాడు రెవెన్యూ పరిధిలోని జేగురుపాడు, మాధవరాయుడుపాలెం పంచాయతీల్లో 3,800 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ఒక్క జేగురుపాడులోనే 2,300 ఎకరాల సాగుభూమి ఉందన్నారు. గత అక్టోబరులో రీసర్వే పనులు ప్రారంభమయ్యాయన్నారు. అయితే పనులు మధ్యలో నిలిపివేశారన్నారు. కోతలు పూర్తయి చేలు ఖాళీగా ఉన్న ఇప్పుడు సర్వే పనులకు అనుకూలం కాగా ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కనీసం స్థానికంగా ఉండాల్సిన సర్వేయర్లనైనా అందుబాటులో ఉంచడం లేదన్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ కారణంగా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని స్టాలిన్ అన్నారు. తక్షణం సచివాలయంలో సర్వేయర్లను అందుబాటులో ఉంచి, రీ సర్వే పనులు వెంటనే పూర్తి చేయాలని ఆయన కోరారు.

సర్టిఫికెట్ల ప్రదానం

మధురపూడి: కోరుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అటల్ టింకరింగ్ ల్యాబ్ నైపుణ్య శిక్షణ తరగతుల్లో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. నాలుగు రోజులుగా వీటిని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కార్యక్రమంలో జిల్లా అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ గౌరీశంకర్, అడిషనల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల విషయంలో అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి

కంబాలచెరువు: జిల్లా న్యాయసేవాధికార సంస్థలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి మాట్లాడుతూ పిల్లలు తప్పిపోకుండా పెద్దలు భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. భారీ జన సమూహాలు ఉన్నచోట పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఒక్కసారి పిల్లలు తప్పిపోతే వారి జీవితం ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రజలు తమ చుట్టుపక్కల జరిగే అనుమానాస్పద చర్యలను సంబంధిత అధికారులకు తెలియజేయడం బాధ్యతన్నారు. అక్రమ రవాణా నివారణ చట్టం 1986, నల్సా వారి అక్రమ రవాణా, లైంగిక దోపిడీ బాధితుల పథకం 2015 అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జె.మహెన్ష, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ పి.సూర్య ప్రభావతి, కోనసీమ జిల్లా డీఎంహెచ్‌వో సభ్యురాలు డాక్టర్ దివ్య పావని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భవానీ శంకర్ సేవలు చిరస్మరణీయం



భవానీ శంకర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంపీ భరత్ రామ్



పుష్పాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ నాయకుడు, 44వ డివిజన్ ఇన్‌చార్జి బూరాడ భవానీ శంకర్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీ మార్గాని భరత్ రామ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఇటీవల హత్యకు గురైన భవానీ శంకర్ సంస్మరణ సభ గురువారం సంజీవయ్య నగర్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పార్టీకి తీరని లోటు

ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ బూరాడ భవానీ శంకర్ మృతి వైఎస్సార్ సీపీకి, వ్యక్తిగతం తనకు తీరని లోటు అన్నారు. ఎప్పుడు తనతో మాట్లాడినా తన స్వప్రయోజనాల కోసం కాకుండా పార్టీ పటిష్టత కోసమే ఎక్కువ పరితపించేవాడన్నారు. అంతటి నిస్వార్థ స్నేహశీలిని కోల్పోవడం చాలా బాధగా ఉందన్నారు. ఎంపీ వెంట నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఆరిఫ్, పీత రామకృష్ణ, హబీబుల్లా ఖాన్, గుత్తుల మురళీధర్, మానే దొరబాబు తదితరులు ఉన్నారు.

ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ పార్టీ కోసం ఆహర్నిశలు కష్టపడిన భవానీ శంకర్‌ను కోల్పోవడం చాలా బాధగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఎవరికీ ఏ కష్టం వచ్చినా, వాటిని పరిష్కరించడంలో ఆయన ముందుండేవారన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎంతగానో పాటుపడ్డారన్నారు. భౌతికంగా ఆయన దూరమైన ప్రజల హృదయాలలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి

రాజమహేంద్రవరం రూరల్: దేశ రాజధాని ఢిల్లీలో రెజ్లర్ల న్యాయ సమ్మతమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఉభయ జిల్లాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం భోజన సమయంలో ఇన్నీసుపేటలోని ఎల్ఐసీ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఉద్యోగుల సంఘం మహిళా కన్వీనర్ శిరీష మాట్లాడుతూ బీజేపీ ఎంపీగా ఉన్న బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే ఇండియన్ రెజ్లర్ ఫెడరేషన్ నుంచి తొలగించాలన్నారు. అఖిల భారత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు పి.సతీష్ మాట్లాడుతూ నాలుగు నెలలుగా వారు చేస్తున్న పోరాటానికి దేశవ్యాప్తంగా ఉన్న ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం తరఫున సంఘీభావం తెలుపుతున్నామన్నారు. గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్, పి.సుబ్బారావు, సత్యదేవ, శ్రీను, రమేష్, రాజు, రామకృష్ణ, విజయదుర్గ, శ్రీదేవి, గాయత్రి పాల్గొన్నారు.

రెండేళ్లలో ప్రేక్షకుల ముందుకు బిచ్చగాడు - 3



విలేకరుల సమావేశంలో హీరో విజయ్ ఆంటోని

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రెండేళ్లలో బిచ్చగాడు – 3 సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తుందని హీరో విజయ్ ఆంటోనీ అన్నారు. అలాగే మరో మూడు సినిమాలు చేస్తున్నానని తెలిపారు. బిచ్చగాడు-2 సినిమా విజయ యాత్రలో భాగంగా గురువారం రాత్రి మొదటి ఆట సమయంలో స్థానిక స్వామి థియేటర్‌కి విచ్చేశారు. అనుశ్రీ ఫిలింస్ సత్యనారాయణ తరపున ఆయన కుమారుడు వెంకట్, థియేటర్ అధినేత ఆనిబాబు, హరిబాబు, రాజు, కరెన్సీ పిక్చర్స్ రాజు, అనుశ్రీ జీఎం వాడ్రేవు సతీష్ కుమార్ పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులతో విజయ్ ఆంటోని మాట్లాడుతూ తెలుగు ప్రేక్షకులు తనను ఎంతగానో ఆదరిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ రఘురాం మాట్లాడుతూ శుక్రవారం బిచ్చగాళ్లతో హోటల్‌లో మీట్ ఉందని, అలాగే జీఎస్ఎల్‌లో ప్రారంభ కార్యక్రమం ఉందని చెప్పారు. అనంతరం థియేటర్‌లో ప్రేక్షకులతో ముచ్చటించి విజయ్ ఆంటోని సెల్ఫీలు తీసుకున్నారు.

ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ సచివాలయం ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ఫైల్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారని జిల్లా సచివాలయం ఉద్యోగుల ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి రవితేజ, మర్రి కాశీవిశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జూన్ 10వ తేదీ వరకూ సచివాలయ ఉద్యోగులకు బదిలీలకు అవకాశం కల్పించారన్నారు. రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ప్రొబేషన్ డిక్లేర్ అయిన ఉద్యోగులందరూ బదిలీలకు అర్హులన్నారు. జిల్లా పరిధితో పాటు అంతర్ జిల్లాల బదిలీలకు కూడా అవకాశం ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పర్యావరణంపై అవగాహన

రాజమహేంద్రవరం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఫారెస్టు బీట్ ఆఫీసర్లు దూడ ఆశారేఖ, అర్చన, మధుమోహన్ అన్నారు. గురువారం లాలాచెరువు జాతీయ రహదారిపై ఉన్న లక్ష్మీహ్యుండాయ్ షోరూమ్‌లో పర్యావరణ పరిరక్షణ – మొక్కలు నాటి సంరక్షించడం అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లక్ష్మీహ్యుండాయ్ మేనేజర్ నాగ వెంకట సునీల్ కుమార్, షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమాలు

శ్యామల	: అన్ని మంచిశకునాలే
సూర్యమినీ	: మెన్‌టూ
సూర్యప్యాలెస్	: నేను ఫేమస్
స్వామి	: బిచ్చగాడు-2
శివజ్యోతి	: కస్టడీ
అనుశ్రీ	: విరూపాక్ష
రాజా	: బిచ్చగాడు-2
అశోక	: మళ్లీపెళ్లి
ఊర్వశి	: ఎలియన్స్2042
రంభ	: ది కేరళస్టోరీ
మేనక	: రామబాణం, ఉగ్రం
అప్సర	: 2018
నామవరం	
వీఎస్ మహల్	: 2018
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: 2018
కడియం	
వెంకటసూర్య	: బిచ్చగాడు-2